# సొరాజ్జెం తాత

ఆ రోజు-

ఆ పేట మహా సంబరంగా ఉంది పేడతో అలికిన ఇళ్ళ గోడలకు సున్నంతో ముగ్గులు పెట్టినట్లు, దరిద్రం తాండవిస్తోన్న ముఖాలుకు చవుకబారు పౌడర్లు సెంట్లతో మగాళ్ళూ, ప్లాస్టిక్‌పూలు, పూసలపేర్లతో ఆడాళ్ళూ గొప్ప ఆనందంతో ఉన్నారు.

అందరూ వీధిలో రామ్మందిరం దగ్గర, రావిచెట్టు దగ్గర, పంచాయితీ ఆఫీసు దగ్గర, ఎలిమెంటరీ స్కూల్ దగ్గర గుంపులు గుంపులుగా ఉన్నారు.

“ఉరే, ఎల్లన్నా, పేటోల్లందరూ ఊరు బయలెల్లి నారోనే దోసూడు అందర్నీ సల్లందులో, అంబలో కడుపుల్నిండా తినేసి బేగి తెమలమను నారీ యోచ్చేసే టయిమయింది. పంచాయితీ మెంబరు జోగయ్య ఎల్లయ్యకు పురమాయిచాడు. ఆ పని సర్పంచ్ వెంకట్రావు జోగయ్యకు చెప్పాడు. వెంకట్రావుకు ఎమ్మెల్సే పరశు రామయ్య చెప్పాడు.

“ఇప్పుడేటి బావూ? కోడికూతకు ముందే ఆల్లు నెగిసి తెమలి పోన్రు!”

“ సర్నే కడుపు నిండా ఏదో ఒకటి నాగించేసి రెడీ గుండమను”

“ ఆల్ల కాకళ్ళు నేవుదద్దా! మన సొరాజ్జెం తాతియ్యకు సనమానం అనగానే ఆల్లకందరికీ కడుపులు నిండిపోనాయి. అలగనీ ఆకల్తో నేరునే, సల్లందులు తీనీసి ముల్లుగోరింట పువ్వుల్నాగా ముస్తాబయిపోన్రు.” అన్నాడు మళ్ళీ జోగయ్య చేత చెప్పించుకోకుండా.

“ఎల్లన్నా! అద్సరే గానీ.. సొరాజ్జెంతాతని మంచి సొక్కా, పంచీ ఏసుకోమన్నావా? ఆడి సేతల పారిటీ జెండా ఉండాల. మరిసిపోకుమీ పెసి డెంటసలికేమంచోడుకాడు. ఇంత పేసిందీ బూడిదల పోసిన పన్నీరయిపోద్ది నేపోతే” అన్నాడు.

“ ఏటి దద్దా, నీ కెందుకా బయం? అయన్నీ నా కొగ్గిసి ఓ అయిదు కొట్టు. మందేసుకొత్తేగానీ బండి నడదు.” అన్నాడు ఎల్లన్న తలపాగా సవరిస్తూ నోట్లో చుట్టను కొరికి తుపుక్కున ఉమ్ముతూ.

“ ఎల్లన్నా పిచ్చి పిచ్చి ఏసాలెయ్యక. మీటింగయి వచ్చిందాకా మందూ గిందూ అన్నావంతే మక్కలిరిగిపోతాయి. తిరిగిరానీ నీకడుపు నిండా పట్టిత్తాను నువ్వెన్ని గేలన్లు తాగుతావో నీ ఇష్టం ఇపుడు నువ్వు మందేసుకుంతే మడిసి కావు” అన్నాడు జోగయ్య ఎల్లన్న బుర్రగోక్కున్నాడు” ఒక్కబస్తా అయినా నేపోతే ..... అని అంటుండగానే “సీ..... నోరుముయ్.. ఇదంమాల్నాడా! ” అన్నాడు. ఇంతలో దూరంనుండి హారన్ వినిపించింది.

“ ఓరదిగో్ట్రా, నారీ యొత్తంది. ఆల్లందర్నీ యిస్కూలు బడికాడికి రమ్మను నేను పెసిడెండ్ కాడి కెల్లొత్తాను” అని అంటున్నంతలో లారీ వచ్చేసింది లారీముందు” గౌ॥ ముఖ్యమంత్రి గారికి ఘనస్వాగతం” ముఖ్యమంత్రి సభను జయప్రదం చెయ్యండి. లే! కదలిరా! ఈ దేశం నీదే దీని రక్షణ బాధ్యత నీదే” “నవభారత నిర్మాణానికి ముందుకురా!” రైతన్నా! కూలన్నా.. ఇది నువ్వ

పోషిస్తున్న దేశమేనన్నా!" లారీ చుట్టూ కట్టినరంగు రంగుల బేనర్లు మేలు జాతి ఎడకొమ్ములకు చేసిన ముస్తాబులా లారీకి జండాల అలంకరణ. అప్పుడే వచ్చిన కొత్త సినిమా పాటల జోరుమరోప్రక్క.

లారీని చూడగానే జనంలో కలకలం, కొత్త వందరూపాయిల నోట్లను జల్లుతుంటే ఏరుకోడానికి కుమ్మలాడు కుంటున్నట్లు ఆకలితో ఉన్న బిచ్చగాళ్ళు. గొప్పోళ్ల సగం తిని పారేసిన విస్తరాకులలోని పదార్థాల కోసం ఒకర్ని ఎగబ్రాకుతున్నట్లు - లారీ ఎక్కేటందుకు జనం కుమ్ములాట సుందలో తుంటరి ఆవులు పొడుచుకు టున్నట్లు ఒకర్ని తోసుకుని ఇంకొకరు ముందుకెళ్తున్నారు. సర్పంచ్ వెంకట్రావు వచ్చే సరికి పులిని చూసి జడుసుకున్నట్లు ఒకరితరువాత ఒకరు లైన్ కట్టి నిలబడ్డారు.

"ఉరే, సొరాజ్జెంతాతియ్యని మాత్రం ముందు సీట్లో కూకో పెట్టండి. తక్కినోల్లంతా ఎనక్కి ఎక్కండి ఎల్లన్నా! ఈ ల్లందర్నీ తీసుకొని నువ్వు లారీ ఎక్కు. మన్నారీ నెంబరు రొండు గుర్తుంచకో! ఎంకటేస్పరా డిగ్రీకాలేజీ తెల్సుగదా! అక్కడోట నైన్లో నెట్టు జనాల్ని డైవోరుకి నువ్వేటి డబ్బులివ్వక్కర్లేదు నువ్వు మాత్రం జాగర్త. డోసేసినావని తెల్సిందా, మక్కలిరిగిపోతాయ్. నాను జీపిలోనో సెపిడెంట్ బండి మీదో వచ్చేత్తాను ఇదిగో సొరాజ్జెంతాతా! నానొచ్చిందాకా మీటింగెట్టీకు ఎండపడిపోతావు. " అని ఎవరికెంత వరకూ చెప్పాలో అంతవరకూ చెప్పాడు.

లారీ కదిలింది. దుమ్ము రేపుమంటూ ఎన్నికలయిన తరువాత మీ కళ్ళలో పడేది నేనే నన్నట్లు " ముఖ్యమంత్రికీ " అని ఎల్లన్న అనగానే ముందు చెప్పి ఉండటంవల్ల తక్కిన వాళ్ళందరూ 'జై' అన్నారు. లారీ స్పీడందుకుంది. సొరాజ్జెం తాతకు గొప్ప సంతోషంగా ఉంది. అతడెప్పుడూ ఇంతటి ఆనందాన్ని అనుభవించలేదు. అందుకే గాల్లో తేలుతున్నాడు మేఘాల్లో విహరిస్తున్నాడు! ఆశ్చర్యం!

- వారం రోజుల క్రితం జీవితం మీదున్న వైరాగ్యం ఇప్పుడు లేద' అతనికపుడు చచ్చిపోవాలనిపించింది. కొడుకుమీదా, కోడలి మీదా, చనిపోయిన తలిదండ్రుల మీదా, దేశంమీదా కసి! చెప్పలేనంత కసి!

ఆ రోజు -

కొడుకు తిట్టాడు " ఈ ముసల్నాకొడుకు ఈడు బతికి మనల్నిసంపుతన్నాడని!

కోడలు తిట్టింది " అతగానికేం? దిబ్బ కుడుం నాగున్నాడు సచ్చింది మనిమే అతగాన్నే మన్నా ముసిలోడికి ఇంసలు పెడతన్నామంతారు. ఈడు సవ్వకుంట మనల్ని సంపుతన్నాడు" అంది.

మనవలు చీదరింపుగా చూసారు.

"తాతా! ఏట్నీవ్వీ బూఫెపంచకం ఉన్నన్నాళ్ళు ఉండిపోతావేటి?" అన్నాడు పెద్ద మనవడు వెటకారంగా.

వీళ్ళంతా తనని 'దేనికోసం తిడుతున్నారని? తన వల్ల వీళ్ళ కొచ్చిన కష్టమేమిటి?

ఇంకేముంది?

తనకి పెట్టాల్సిన పట్టెడన్నంకోసం! పొయ్యాల్సిన డోకిడు అంబలి కోసం, బుక్కెడు గెంజి నీళ్ళకోసం, గేనుడు టీ సుక్కలకోసం!'

ఇన్నాళ్ళూ -

తను జముకుల పాటలు పాడేవాడు పిట్టకతలు సెప్పేవోడు. జనం ఇరగబడి నవ్వేకోరు. గింజలూ, డబ్బులూ ఏసీ వోరు. ఇపుడు తన సెర్లింలో సత్తువనేదు. అందులోనూ, మాయిదారి జోరం వగ్గకంట తినేస్తంది.

ఒళ్ళంతా నిస్సత్తువ నరాలు తెగిపోతున్నంత సలుపు కడుపులో పేగుల్ని పురుగులు కొరికేస్తున్నంత బాధ. కాళ్ళ మీద నుండి రోలర్లు వెళ్తున్నంత పీకు కిరకిరా చుట్టుకు పోయాడు. నాలుక పిడచకట్టుకుపోయింది. గొంతెండిపోయింది. కనురెప్పలు పైకి లేవటంలేదు. ఏదో మాటాడాలని ఉన్నా నోరు పెగలటం లేదు. కానీ అందరూ అంటున్న మాటలు మాత్రం వినిపిస్తున్నాయి. అయితే - ఒకటి మాత్రం తెలుసు తనింత వేగరం చావడని ఎందుకో మనసులో మాత్రం ఆ నమ్మకం ఉంది.

కోడలు అరగ్లాసుడంటే అరగ్లాసుడు టీ చుక్కలు తెచ్చి ఇచ్చింది. గొంతులో తనే పోసుకున్నాడో, ఎవరైనా పోసారో తెలీదు. ఆరిపోతున్న దివ్వెకు చమురు పోసినట్లుయింది. ఊపిరొచ్చింది. నాలుక్కిరుచి తెలుస్తోంది. ఆ టీలో పంచదార చాలదు. కానీ వేడి ఉంది. నాలుక చురుక్కుమంది. "ఉరే, అయ్యా! బుక్కెడు గంజి నీళ్ళోట్టుకురారా. జివ్వసచ్చిపోనాది" అన్నాడు. "జివ్వ సచ్చినాది గానీ .. నువ్వుసావ్వు" అన్నాడు మనవడు అందరూ గొల్లున నవ్వారు. కొడుకుతో సహా ఆ తరువాత కొడుకు గయ్ మన్నాడు కోడలు బుస్సుమంది". ఏటి? నిన్ను సంపీసినామన్న సెడ్డపేరు మాకు తేనానికా? ఒల్లు కాలిపోతుంటే గెంజినీల్లట గెంజినీల్లు!" అంది.

"నాకు సచ్చీపాటి అదురుట్టం నేదమ్మా" అన్నాడు కోడలు తన పైన అభిమానంతో ఆమాటలనలేదని అతనికి తెలుసు! తనకా గెంజి మెతుకులు పడేస్తే .. వాళ్ళ కెక్కడ తక్కువయిపోతుందనేది ఆమె బెంగ అంత కన్నా - 'ఆ గెంజి తాగి తనెక్కడ బతికి మళ్ళీ భారం అయిపోతాననో వాళ్ళ భయం!' మనసులో విలవిల్లలాడిపోయాడు.

"ఉరే అయ్యా! రవిణియ్య బావుకాడికెల్లి ఓ మాత్రతెచ్చి పెట్రా. నాపిక్కల సత్తువతో నాన్నేసి తిరగ్గలిగితే నాకూడు నాను సంపాయించుకోడమే గాదు.. నా జముకు మిమ్మల్నీ పోసిస్తాది". అన్నాడు.

"ఆ.. ఆరోజులు పోనాయి. నీ పాటలకిపుడెవులూ రూపాయిలు జల్లీరుఅయినా రవిణియ్య కాడి కెల్లాలంటే అయిదు రూపాయిలుండాల ఎనకటికి అమ్మకిండేసినిచ్చినాడా? ఆటికే డబ్బుల్నేదు. మల్లీ ఫిలిత్తే ముకం మీద ఊసెత్తాడు" అంది కోడలు. కొడుకును కదల్నివ్వకుండా మాటలతో కట్టి పడేసి.

అప్పుడేడిచాడు కుక్కిమంచంలో కుళ్ళికుళ్ళి 'ఇంకా తనెందుకు బతికున్నాడా?' అని.

సరిగ్గా అప్పుడే వచ్చాడు వెంకట్రావు " తాతియ్య సొరాజ్జిం తాతియ్యా!" అంటూ

"ఎవులూ? వణుకుతోన్న స్వరంతో తాత

"నాంతాతియ్యా ఎంకట్రావుని. పెసిరెంట్ని"

"ఏటి? ఎంకట్రావు బాబా? తవురేటిలా గొచ్చీసినారు? ఉరే.. రావుడూ.. ఆ పీటొట్టుకు రాయే బావుగా రొచ్చినారు." అని సొరాజ్జెంతాతియ్య కొడుకు కుడావుడి చేసాడు. రాముడు పీట తెచ్చింది.

"ఏం తాతియ్యా! ఏటి తొంగున్నావేటి?"

"ఏం సెప్పమంతావు కొడకా! ఎనకటి కెన్నిపాపాలు పేసినానో". ఇంకా సవ్వకంట బతుకు తన్నాను" అన్నాడు.

" అలాగనకు తాత! నీలాటి పెద్దోలుంటే మాకెంతోనాబం" అన్నాడు అభిమానాన్ని ఒలకబోస్తూవారం రోజులుగా దిక్కు మాలిన జొరం నెగనియ్యకంటుంది. పచ్చిమంచీలు నోట పొయ్యిటం నేదు" అన్నాడు సొరాజ్జెంతాత కొడుకు. "అరెరె! నాకు చెప్పలేకపోయావా నువ్వు బేగెల్లి రవిణియ్యని పిల్చుకురా! ఇదిగో నామాటగా సెప్పు తాత కిండీసనియ్యాల రమ్మను అని తనతో వచ్చిన పాలేరుకి పని పురమాయించి, "తాతా! ముఖ్యమంత్రి వత్తండు మనెమ్మెల్యే గారికీ పరిటీ మినిట్రి రావాలి. అందుకని మన ముఖ్యమంత్రి అందిస్తన్న సౌకడిసోల బియ్యం, నోన్లు, ఇల్లు, గేస్టౌలు పథకాలు.. ఇయన్నీ నువ్వు పదాలుగా కూర్సి పాడాల? నీ జముకుల పాటకు అయిసయిపోవాల. అటు ములగాం' నుండి, ఇటు 'పీరిబిల్లి' రాయొల్స' లనుండి, సెక్కబజనటూ, పులు, బుర్రకతటూపులు సానా వత్తన్నాయి. ఈడియోతీసి టీవిలో ఇత్తన్రు నువ్వుమరెలాగ పాడతావో సూడాల ముఖ్యమంత్రి డంగయిపోవాల మరో రెండు సంవత్సరాలో ఎన్నికలొత్తాయి. నుల్లిక్కణ్ణుంచి ఊరూరా తిరిగి పెసారం సెయ్యాలనీకు దేనికి నోట్నేకుండా నీన్సేత్తాను" అన్నాడు.

సొరాజ్జెంతాత చచ్చిన గెదెపెయ్యిలాగున్నాడు. అలాంటి తాతలో ఎక్కణ్నుంచో ఉత్సాహం వచ్చేసింది. మంచంలో లేచికూచున్నాడు. అప్పుడతన్ని చూస్తే చితిమీద నుంచి లేచి వచ్చిన శవంలా ఉన్నాడు. సొరాజ్జెంతాత చేతిలో వందనోటు పెట్టాడు వెంకట్రావు! "ఇదిగో ఇయుంచు ఈటితో రొట్టిపాలు కొనుక్కో రవిణియ్యకి డబ్బులు నేనిత్తాను" అన్నాడు వెంకట్రావు ఇచ్చిన వందనోటు కోడలుకిస్తూ "ఇంతకీ ముఖ్యమంత్రి గారెప్పుడొస్తాడయ్యా!" అన్నాడు. తాతకు వందనోటు చూడగానే సగం జొరం తగ్గేసింది.

" సరిగ్గా ఇయ్యాల్టికి పదిరోజులుంది"

ఆ తరువాత రవిణియ్యొచ్చి ఇంజక్షన్లు, మందులూ ఇచ్చారు జ్వరం తొందరగా తగ్గేటట్లు చూడమని సర్పంచ్ చెప్పాడు.

కొడుకు సొరాజ్జెంతాతని కూర్చో పెట్టాడు కోడలు వేడి నీటితో ముఖం కడిగింది. మనవలు చుట్టూ ఆస్యాయంగా చేరారు సొరాజ్జెం తాతకీమార్పులో ఆశ్చర్యం కనిపించలేదు కొడుక్కి తండ్రి మీద అభిమానం పెరగటానికి కోడలు ఆత్మీయంగా చూడ్డానికీ, మనవలు ప్రేమతో చుట్టుముట్టడానికి

కారణం అతనికి తెలియందేంకాదు. డబ్బులో ఉన్నమహత్తర శక్తి , అలాంటిదని అతని కేనాడో తెల్సు అనుభం ఏనాడో నేర్పిన పాఠం అది అంతేకాదు -

దరిద్రం ఎంతటి బంధాన్నయినా తెగతెంపులను చేస్తుంది, అని అతనికి జీవితం నేర్పింది. అందుకే అతనికి కొడుకు మీదా, కోడలి మీదా, మనవలమీదా గానీ కోపం రాలేదు.

"ఏటాలోచిస్తన్నావు తాతా?" అన్న ఎల్లన్న మాటలకి ఈ లోకంలోకి వచ్చిన తాత "అహా.. ఏటి నేదు" అన్నాడు.

"తాతియ్యా! ఎప్పట్నించో అడగాలనుకుంతన్నాను ఇంతకీ నీపేరేటి?" అన్నాడు ఎల్లన్న.

"ఎట్రోయ్ ఇన్నాల్లకి నాపేరుగా వాల్చొచ్చింది" అని నవ్వేసి రాజియ్య ఉప్పాడ రాజయ్య" అన్నాడు మొదట తన పేరు చెప్పి తరువాత ఇంటి పేరుతో సహా చెప్పాడు.

"తాతియ్యా? మరి నీకు సొరాజ్జెంతాతియ్య, అంటారేటి?" అన్నాడు.

" అదో పెద్దకత ఓపికుంతే ఇను, సెవుతాను అయి తెల్లోళ్ళు మన దేశాన్నేలే రోజులు గాందీగారు ఊరూ వోడా తిరుగుతన్నారు అతని తో పాటు పెద్ద పెద్దోల్లు సానామంది తిరుగుతన్నారు గాందీ గోరు కాకినాడొత్తన్నారని తెలిసింది. నాకయితే ఎల్లాలని ఉంది కానీ అయ్యోల్లనియ్యడు కదా! పెతిదానికీ అడ్డు సెప్పివోడు. సదువుకుంతానంటే సదువెందుకురా? సంకనాక నానికి అనే వాడు. అన్నీ ఆడు సెప్పినట్టే జరగాల! నేపోతే వీవు సాపుసేసీసివోడు. ఆడితో జముకుల పాటకి తీసకెల్లీవోడు సిన్నప్పుడేనా పాటలంటే అందరికీ సానా ఇష్టం నాను పాడితే డబ్బులెక్కువ వచ్చీవి. అక్కణ్నుంచే నాను సొంతంగా కూర్చిపాడీవోణ్ణి, అదిగలాట్టయింలోనే గాంధీగోరిరాక ! ఎల్లాలనుంది ఎలాగ? ఆలోసించినాను. జముకొట్టుకొని అయ్యకు సెప్పకుండా, రైలుబండి ఎక్కేసి, సామర్లకోటలో దిగిసినాను.సేతిలసిల్లిగవ్వనేదు. కడుపులో పందికొక్కులు పరుగుతీస్తున్నాయి.సేతల జముకుంది కదా: గాంధీ గోరిమీద అప్పటికప్పుడు పాట కూర్చినాను. "కోమటికులముల పుట్టి - కోట్లమీద ఆశ నేక - కులం తక్కువోల్ల కొరకు బతుకునంతకరునుబెట్టి - తెల్లవోల్ల గుండెల్లో - పిడుగులనే కురిపించే మానబావుడా? నువ్వు మనిసివి కాదయ్యా, బూమ్మీదికొచ్చినట్టి దేవుని పెతిరూపమయ్యా " అని పాతిక పదాలతో వరుసలు కూర్సి పదంపాడినాను. నాకునిజం నీకబద్ధం ఆపాటకి గంటలో పాతికరూపాయిలు దొరికినయి. ఓ బాబు మల్లీమల్లీ పాడించుకొని, నా వివరాలు తెలుసుకుని, అయిదురూపాయిలిచ్చి, ఒటేల్లో బోయినంపెట్టించాడు. బోంచేసి, తిన్నగా గాంధీగారి మీటింగ్కెల్లినాను. గాంధీగార్ని సూసినాను ఆరికాడికెల్లి ఆర్ని తాకాలని కోరిక, లోపలికెల్లినానికి కుదర్నేదు. దువ్వారం కాడగాంధీగోరిమీద పాటలుపాడి డబ్బులు దండినాను అయి ఆరికందించాలని నాకోరిక ఈ డబ్బులు దండి 'వందేమాతరం' అని కేకేసేసరికి పోలీసోడొచ్చి, సెయ్యిపట్టుకునాగీసి పక్కకి తోసేసినాడు. ఈలోగా మీటింగయిపోయి. ఆబాబెల్లిపోనాడు. మనసంతాసెమోరుగా అయిపోనాది. ఇంత సెమారుతా అయిపోయినందుకు తెగ బాదపడిపోన్ను, ఆ మానబావుని చూసినాను. అదే పదివేలనుకున్నాను" అని భుజంమీద తువ్వాలుతో ముఖం తుడుచుకున్నాడు. మళ్ళీ చెప్పటం ప్రారంభించాడు.

"అయితే తరువాత నాపాటలకీ గిరాకీ పెరిగింది.మామూలు పాటలతోటి సొతంత్రం

పాటలూ. జముకుతోవోయించి పాడేవోణ్ని, ఈలోగా 'మాకొద్దూ-నీ తెల్లదొరతనమూ' అన్న పాట నేర్చినాను. సదూరాని నానాటోడు ఈపాట పాడ్డం అందరికీ అచ్చెర్యమయిపోయింది ఈదిఈదిల పాడించేవోరు. మాయయ్య డబ్బులు దండేసేవోడు, ఇంతలో సిన్న గమ్మత్తు జరిగిపోనాది. పోలీసులు నా ఎడ్రాసు కనుక్కోనివొచ్చినారు ఆ టయానికి నానింట్లో నేను "ఎవుడ్రా, ఉప్పాడ రాజయ్య?" అడిగినారట మా యయ్య ఠకీన మా ఎదరిల్లుసూపెట్టేసినాడు. ఆల్లు మాబాగారోల్లు ఆడూ ఉప్పాడ రాజయ్యే, ఆడితండ్రి పేరూ, మా తండ్రి పేరూ ఒక్కటే, ఆడూ జముకుల పాటలు పాడేవోడు. ఆడు కావమ్మ కత, సీతమ్మోరివనవోసం, సన్నాసమ్మ కతలు పాడేవోడు నేను కాకినాడ సబలకెళ్ళొచ్చిందగ్గర్నుంచీ సొరాజ్జెం మీదె పాడివోణ్ణి, సీతారామరాజు,బోసుబాబు, బగతసింగూ... గాంధీగోరు.... ఆల్లమీదనే నా పాటలన్నీ, పోలిసోల్లు మాబాగారోణ్ని పట్టుకుపోన్రు, అదే ఆడికి నాబం.... నాకుదయిద్రం సుట్టేడం అయిపోనాది, ఏదో అంతారునే దయిద్రగొట్టోణ్ణి బాగుసేసేవోరూ - దశమంతుణ్ణి పాడుసేసివోరూ ఉండరని, ఆతోయం అయింది నాబతుకు". అన్నాడు నిట్టూరుస్తూ.

"ఏం? ఏమయింది?" అంతవరకూ శ్రద్ధగా వింటూ, సిగిరెట్టు కాలుస్తున్న డ్రైవరు అడిగాడు.

"ఆణ్ణి జైల్లో పెట్టికుల్లపొడిసేసారు. ఆడ్నెన్నో బాదలుపెట్టారు. అందునుంచి సొరాజ్జెం వచ్చాక ఆడు సొరాజ్జ సమరయోధుడయిపోనాడు. ఆడికిపించనీ... ఆడికొడుకులను సదువులు, ఉద్యోగాలూ, ఇళ్ళ పట్టాలూ....... వచ్చినాయి. 'మా అయ్య తెలివితక్కువతనం నాకొంపతీసింది. మా బాగారోడు నామీద కోపంతో నాకు బతుకునేకంటనేసేసినాడు" అన్నాడు. ఒక రెండు నిమిషాలు విచారంగా ముఖం పెట్టి, "ఎల్లన్నా! నాను కిట్టక సెపుతున్నాననుకుంతావో ఏటోగానీ అసలా రోజుల్లో సొరాజ్జెం కోసం పాటుపడినోల్లలో సేనామంది ఎందుకూ పనికిరాకుండా పోనారనుకో! అదిగాతరువాత నాకుమాత్రం 'రాజయ్య' పేరు మరుగున పడిపోయి, 'సొరాజ్జెం తాత' గా జనంలో ఉండిపోనాది.' అన్నాడు.

అతడి కళ్ళలో నిరాశ నీలినీడలు కమ్ముకున్నాయి గొంతు గాద్గిదికం అయింది లారీ కాలేజి గ్రవుండ్సు చేరింది. బారులుబారులుగా లారీలు లారీలనిండా జనం, కొన్ని వేలమందితో గ్రవుండు కిటకిటలాడుతోంది. సొరాజ్జెంతాతని లారీలోనే ఉంచాడు ఎల్లన్న, చెక్కభజనవాళ్ళు, బొమ్మలాటలవాళ్ళు, బుర్రకధ కళాకారులు మేకప్పులుతో వచ్చేరు.

ఎండ మండిపోతోంది.

పదిగంటలకు వస్తాడనుకున్న ముఖ్యమంత్రి పన్నెండు గంటలయినా రాలేదు రెండుదాటింది. పికరులేదు. జనం మాడిపోతున్నారు దాహంతో నోరు ఆర్చుకుపోయి విలవిలలాడిపోతున్నారు. 'ఇదిగో ముఖ్యమంత్రి,' "అదిగో ముఖ్యమంత్రి" అని మైకుల్లోచోటానాయుడు ప్రకటనలు, జనంలోకదలిక ప్రారంభమయింది. ఎక్కడకిపోతారు? ఊరుకి రెండు మైళ్ళదూరంలో సభ ఏర్పాటయింది.జనంలో విసుగు, కోపం ఎక్కువవుతుంటే - కనిపించిన నాయకులను తిడుతున్నారు. సోడాబండివాడొచ్చాడు. అందరూ వాడిమీద పడ్డారు అరగంటలో వాడిసోడాలన్నీ ఖాళీ అయిపోయినా, వాడికి డబ్బులు మాత్రం అందలేదు. టీ కుర్రాడొచ్చాడు డబ్బులివ్వందే టీ ఇవ్వనన్నాడు. డబ్బులిచ్చి టీలు తాగారు. కానీ వాడికి గ్లాసులందలేదు. సర్పంచ్ వచ్చి సొరాజ్జెం తాతకు 'కొబ్బరిబొండాం' ఇప్పించాడు అది

తాగి చల్లబడ్డాడు. తాతని ఎండలోకి మాత్రంరావద్దని హెచ్చరికచేసి వెళ్ళాడు.

ఎట్టకేలకు రాత్రి ఎనిమిది దాటుతుండగా ముఖ్యమంత్రివచ్చారు. హెలికాప్టరు ట్రబులిచ్చిందని, ఆలస్యానికి క్షమించమని వేడుకున్నాడు. 'ఇంతసేపు మీకు శ్రమ కలిగించినందుకు పేరుపేరునా క్షమించమని కోరుకుంటున్నాను' అన్నాడు. ముఖ్యమంత్రి వెనుక నుండి ఎమ్మెల్యే చప్పట్లు కొట్టమని సంజ్ఞచేసాడు. చప్పట్లుదద్దరిల్లాయి. ఎమ్మెల్యే పరశురాంగారు గారు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ తరువాత ముఖ్యమంత్రి తన ప్రభుత్వ చేపడుతున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో కొత్తగా చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు. రానున్న ఎన్నికల్లో తమపార్టీని తమసేవలే గెలిపిస్తాయన్నాడు. మేం తప్పులు చేస్తే మమ్మల్ని నిలదీయండి దండించండి." అన్నాడు ఈసారి పరశురాంగారు ముందుకొచ్చి చప్పట్లు కొట్టాడు. జనం అతన్ని అనుసరించారు.

ముఖ్యమంత్రి వెళ్ళిపోతానన్నాడు.

ప్రొద్దుట్నుండీ వేషాలతో చెమటలు కారిన కళాకారులు నిరుత్సాహ పడ్డారు. ముఖ్యమంత్రి ని పరశురాం వప్పించి ఎట్టకేలకు 'సొరాజ్జెంతాత ' జముకులపాటని వినాల్సిందని పట్టుపట్టాడు. జనంలో కూడా 'సొరాజ్జె.ంతాత పాడాలి' అని గోలప్రారంభం అయింది.

సొరాజ్జెంతాత వేదికెక్కాడు ఘుందు గాంధీ గారిమీద ఆ రోజుల్లో పాడినపాటలుపాడి, ఆ తరువాత ప్రభుత్వం చేస్తోన్న సేవలు వివరిస్తూపాటలు పాడాడు, జనంలో ఊపురాకపోయేసరికి చిన్నట్రిక్కు చేసాడు. ''కొట్టండి.....తన్నండి.....ప్రేమా! ''స్టెయిల్లో అప్పటికప్పుడే ముఖ్యమంత్రిమీద పాటకూర్చి పాడాడు. ఇకనేం?జనంలో హుషారొచ్చింది. స్టెప్పులు ....గెంతులు....ఈలలు తొంభై ఏళ్ళతొక్కులాట 'సొరాజ్జెంతాత' డాన్స్ చేసి పాడుతుంటే - ముఖ్యమంత్రి సంతోషం పట్టలేక.... వేదికెక్కి అతని మెడలో పూలమాలవేసి శాలువకప్పి గట్టిగా హత్తుకున్నాడు. సభ మారుమ్రోగిపోయింది చప్పట్లతో.

ముఖ్యమంత్రి సభ నుద్దేశించి "కళాకారులు మన్నించాలి. అందరి ప్రదర్శనలు చూసే అదృష్టం నాకూ లేనందుకు చింతిస్తున్నాను, ఇంతమంది కళాకారులున్నారని నాకిప్పుడే తెల్సింది. మిమ్మల్నందర్ని హైద్రాబాద్ రప్పించి, "రవీంద్రభారతిలో ప్రదర్శనలు చేయిస్తాను. మీ అందరికి ఇళ్లపట్టాలు మంజూరు చేస్తున్నాను. మీ ఎమ్మెల్యేగారికి మీ దరఖాస్తులివ్వండి. "అనేసి" తాతా నీకేంటి కావాలి?'' అన్నాడు.

"బాబూ, నాకేటికావాలని అడగమంతారు?'' అన్నాడు తాత

"నీక్కావలసిందే అడుగు '' ముఖ్యమంత్రి అడిగాడు వెంటనే తన దగ్గర ఉన్న మనవణ్ని దగ్గరకు తీసుకుని, "బాబూ, ఈడు నా మనవడు ఇంటర్మెంటయినాడు. కాళీగున్నాడు ఈడికేదయినా ఉజ్జోగం ఏపించండి తండ్రీ! '' అన్నాడు కళ్ళనీళ్ళతో వెంటనే పి.ఏని నోట్ చేసుకున్నాడు ముఖ్యమంత్రి పి.ఏ. వివరాలు నోట్ చేసుకున్నాడు.

సొరాజ్జెంతాత ఆనందానికి అవదుల్లేవు

జనం ఇళ్ళకు పోతున్నారు కొంతమంది ముఖ్యమంత్రిని జనం మనిషన్నారు కాస్త చదువుకున్నవారు 'ఎన్నికలస్టంట'న్నారు. అనుభవజ్ఞులు 'ఈమాటలు సొతంత్రం వచ్చిన

దగ్గర్నుంచీచూస్తున్నారు. కొంతమంది ఈ జనానికి బుద్ధి రాదన్నారు. గొర్రె కసాయివాణ్ణి 'నమ్మినట్టు ఈ నాయకులను జనం నమ్ముతారన్నారు.

మొత్తం మీద సభముగిసి జనం కదిలారు. అందరూ లారీలెక్కారు. ఇప్పుడు సొరాజ్జెంతాతకి ముందు సీటు దొరకలేదు. వెనుకకు ఎక్కించారు. అందుకతడేం బాధపళ్ళేదు. అతడి మనసు మహదానందంలో ఉంది. తనమనవడు ఉజ్యోగస్తుడవుతున్నాడు. వాడయినా సుఖపడతాడు. అదీ అతని సంతోషం!

లారీ గాల్లో తేలుతోంది.

డ్రైవరు మంచి మందు పట్టులో ఉన్నాడేమో, లారిని విమానంలా పరుగెత్తిస్తున్నాడు. సొరాజ్జెంతాత మనసు లారీకన్నా స్పీడుగా పరుగెడుతోంది. సొరాజ్జెంతాత కొడుకు, కోడలూ, మనవలూ అందరికీ తాత ఇప్పుడు దేవుడు! లారీ స్పీడులో వస్తున్న గాలి హాయిగా, చల్లగా ఆనందంగా ఉంది. అందరూ నిద్రలోకెళ్తున్నారు. డ్రైవరుకళ్ళే మత్తుతో మూతలు పడుతున్నాయి. అద్దం మసగ్గా ఉంది. దారీ మసక, మసగ్గా ఉంది. రెప్పలు మూతపడీ తెరుచుకుంటున్నాయి.

ఆ దోబూచులాట మధ్యలో -

అతనికి కనిపించిన దృశ్యం!

తలతెగిన మనిషా? కాదు తెగిన ఖానా! రోడ్డు డైవర్షన్ బోర్డు! పరిస్థితి చెయిదాటింది. అదుపుతప్పింది. ఒళ్ళు చెమటెక్కింది. మత్తుదిగిపోయింది. బలంగా స్టీరింగ్ తిప్పాడు. సడన్ బ్రేకు వేసాడు. లారీ బంతిలాఎగిరింది. చిచ్చుబుడ్డీలోంచి ఎగిరిన మతాబాల్లా జనం ఎగిరిపడ్డారు. బాంబు పేలిన తరువాత చిరిగి ఎగిరిన కాగితపు ముక్కల్లా తుళ్ళిపోయారు.

తెలివి వచ్చిన వాళ్ళ హాహా కారాలు... ఆక్రందనలు... గగ్గోలు!

భూమి దద్దరిల్లింది. మిన్ను విరిగిపడింది. లారీ తిరగబడింది.

మర్నాడు-

చచ్చిన వాళ్ళు చావగా - చావో, బ్రాతుకోతేలని వాళ్ళుకొన ప్రాణాలతో ఊగిసలాడగా- క్షత గాతులు, కట్లతో కుళ్ళికుళ్ళి ఏడుస్తున్నారు. హాస్పిటల్లో -

చనిపోయిన వాళ్ళలో -

సొరాజ్జెంతాత కొడుకున్నాడు. కోడలుంది. కూతురుంది అల్లుడున్నాడు. మనవలూ ఉన్నారు!

చావక మిగిలిన వాళ్ళలో-

కాళ్ళు విరిగి, కన్నుపోయి, గుండెగాయాలతో సొరాజ్జెంతాతా ఉన్నాడు. తెల్లవాళ్ళు విడిచి వెళ్ళిన భారతావనిలాగా!

(జాగృతి వారపత్రిక 27-3-1995)

✱ ✱ ✱ ✱